

ఏసీబీ వలలో డీఈఈ

వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో డీఈఈగా పనిచేస్తున్న మహమ్మద్ సిరాజ్ మొహియుద్దీన్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

- 8లో



విద్యార్థులే కొరియర్లు

గంజాయి రవాణాలో విద్యార్థులు, యువకులు కొరియర్లుగా మారుతున్నారనే విషయం ఇటీవల పోలీసు దాడుల్లో వెల్లడైంది.

- 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^0/21^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఆరుగురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.వెంకటేశ్వర్లు వీఆర్ నుంచి వంగర పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.మౌనిక వంగరనుంచి వీఆర్‌కు, ఎం.మహేందర్ మట్టెవాడ నుంచి ముల్కనూర్‌కు, ఎ.ప్రవీణ్‌కుమార్ ముల్కనూర్ నుంచి వీఆర్‌కు, బి.అనిత సుబేదారి నుంచి వీఆర్‌కు, ఎస్.జీనత్ జనగామ నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు.

చెయ్యెత్తితే ఆగేదే ఆర్టీసీ బస్సు..

చిల్పూరు: సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే కాకుండా ప్రయాణికులు చెయ్యెత్తిన కాడా ఆగేదే ఆర్టీసీ బస్సు.. సంస్థను ఆదరించేది కూడా ప్రజలే అని వరంగల్–1 డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావు అన్నారు. 'ప్రజల వద్దకు ఆర్టీసీ'లో భాగంగా మండల పరిధి శ్రీపతిపల్లి జీపీ ఆవరణలో బుధవారం సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు, దివ్యాంగులకు ఆర్టీసీ ఎన్నో రాయితీలు కల్పిస్తోందని చెప్పారు. ఉప సర్పంచ్ గొంగిడి అనూరాధకృష్ణమూర్తి, ఎంపీటీసీ అయిలమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కొయ్యడ రాందాసు, కొయ్యడ శ్రీనివాస్, ఉడుత వెంకన్న, స్టేషన్‌ఘన్‌పూర్ బస్‌స్టాండ్ కంట్రోలర్ రఘువీర్, సీఆర్‌సీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తరిగొప్పుల: మండల పరిధి అంకుషాపూర్‌లోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, పౌష్టికాహారాన్ని పరిశీలించిన ఆమె.. మాట్లాడుతూ.. మూడు సెంటర్లు ఒకే చోట ఉండడం వల్ల ప్రీస్కూల్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంలేదని, కేంద్రం–2 లబ్ధిదారులను సమీప కేంద్రానికి మార్చుకోవాలని అంగన్‌వాడీ టీచర్ వినోదకు సూచించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు, సమయపాలన పాటించాలని, లేదంటే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

లింగాలఘణపురం: మండల పరిధి నెల్లుట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.కుమారస్వామిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు డీఈఓ రాము ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్జీటీగా పని చేస్తున్న కుమారస్వామి గతంలో ఓసీఎల్స్‌పై సంతకాలు చేయడం, 38 రోజుల హెచ్‌పీఎల్‌కు బదులుగా 88గా దిద్దడంపై డీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా డీఈఓ పట్టించుకోవడంలేదంటూ రాష్ట్ర కమిటీ విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా పాఠశాల విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీతో విచారణ చేపట్టి నివేదిక సమర్పించారు. ఫిర్యాదులో పేర్కొన్నవి నిజాలని తేలడంతో ఈ నెల 13న సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పంచాంగం ఆవిష్కరణ

పాలకుర్తి టౌన్ : శోభకృత్ నామ నూతన తెలుగు సంవత్సర పంచాంగాన్ని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఆలయ చైర్మన్ రామచంద్రయ్య శర్మ ఆవిష్కరించారు. ఈ పంచాంగాన్ని అర్చకుడు దేవస్థాన ఆస్థాన పంచాంగ కర్త డాక్టర్ మత్తగజం నాగరాజుశర్మ సిద్ధాంతి రాశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ పంచాంగం సులభంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉందని సిద్ధాంతిని అభినందించారు.

రుధిర దారి!



పై ఫొటోలో కనిపిస్తున్నది లింగాలఘణపురం మండలం నెల్లుట్ల బ్రిడ్జిపై ఈ ఏడాది జనవరి 21 జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం. ఆటోలో కూలీ పనులకు వెళ్లిన వారు తిరిగి గ్రామాలకు వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు.

- రక్తమోడుతున్న ఎన్‌హెచ్–143
- అసంపూర్తి పనులతో రోడ్డు ప్రమాదాలు
- ఏడాది కాలంలో 61 మంది మృత్యువాత
- క్షతగాత్రులుగా మారిన 149 మంది
- సర్వీస్ రోడ్లు, రెయిలింగ్‌లు, యూటర్న్‌ల ఏర్పాటుపై జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలో జాతీయ రహదారి–143 పనుల విషయంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఎన్‌హెచ్ వెళ్లే గ్రామాల్లో సర్వీస్ రోడ్లు, సైడ్ రెయిలింగ్‌లు, సరైన ప్రమాద హెచ్చరిక బోర్డులు, యూటర్న్ సదుపాయం లేక అనునిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా పరిధిలో 39 కిలోమీటర్లు ఉండే జాతీయ రహదారి జనగామ మండలం పెంబర్తి వద్ద కాకతీయ కళాతోరణం ముఖద్వారం నుంచి ప్రారంభమై చిన్నపెండ్యాల, వంగాలపల్లి వరకు ఉంటుంది. ఈ రహదారిపై ఏడాది కాలంలో 172 ప్రమాదాలు జరగ్గా.. 61 మంది మృత్యువాత పడ్డారు. 149 మంది గాయాలపాలయ్యారు.

సర్వీసు రోడ్లు.. యూటర్న్‌లు లేక..

సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రజలు నేరుగా ఎన్‌హెచ్‌పైకి వస్తున్నారు. యూటర్న్, క్రాసింగ్‌లు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నా ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఏదైనా భారీ వాహనం రిపేరుకు గురైతే సంబంధిత అధికారులు పట్టించుకోకుండా రోడ్డుపై వదిలేస్తున్నారు. దీంతో ఇతర వాహనాలు వచ్చి ఢీకొడుతున్నాయి. జాతీయ రహదారి ఉన్న జనగామ, లింగాలఘణపురం, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో పోలీసులు.. స్పీడ్‌గన్‌లు, డ్రంకెన్ డ్రైవ్ తదితర తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది.

2022 మార్చి నుంచి ఇప్పటి వరకు ఏడాది కాలంలో ఎన్‌హెచ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు

మండలం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు
జనగామ	50	36	22
లింగాలఘణపురం	20	31	7
రఘునాథపల్లి	32	19	13
స్టేషన్‌ఘన్‌పూర్	44	33	11
చిల్పూరు	26	30	8

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ తరపున తగిన చర్యలు తీసుకుంటున్నాం. యాక్సిడెంట్ జోన్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. రెగ్యులర్‌గా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలి. రోడ్డుపై వాహనం రిపేరుకు వస్తే వాహనం ముందు, వెనక, పక్కన సంకేతాలు ఏర్పాటు చేయాలి.

- సీతారాం, వెస్ట్‌జోన్ డీసీపీ

ఇవీ ప్రమాదకర ప్రాంతాలు

- జిల్లా ప్రారంభంలో పెంబర్తి ముఖద్వారం తర్వాత టంగుటూరు శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ప్రజలు జనగామకు, పెంబర్తికి వెళ్లాలంటే రోడ్డుపై రివర్స్‌లో రావాల్సి వస్తుంది. సర్వీసు రోడ్డు పూర్తిగా లేకపోవడంతో ప్రజలు రహదారిపై రాంగ్‌రూట్‌లో వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- పెంబర్తి గ్రామంలో జాతీయ రహదారి పక్కనే వైన్‌షాపు ఉంది. రోడ్డుకు ఒకవైపు టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వైన్‌షాపునకు వచ్చి వెళ్లే వారు డైరెక్టుగా రోడ్డుపైకి వస్తున్నారు. సాయంత్రమైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. రోడ్డు పక్కనే వాహనాలు నిలపడం, వైన్‌షాపులో సిట్టింగ్‌లు, మద్యం తాగిన వారు నేరుగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పెంబర్తిలో బస్టాండ్ వద్ద అండర్‌పాస్, పెంబర్తి ఊరిలో నుంచి టంగుటూరు శ్రీనివాసపురం వరకు సర్వీసు రోడ్డు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.
- పెంబర్తి నుంచి జనగామ పట్టణంలోకి వచ్చే బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. జనగామ అని చూపే మార్కింగ్ బోర్డు బైపాస్‌కు 100 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేశారు. వాహనదారులు దగ్గరికి వచ్చాక బోర్డు కనిపిస్తోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- లింగాలఘణపురం నెల్లుట్ల వద్ద వెహికిల్ అండర్‌పాస్ బ్రిడ్జి వేయకుండా ఫ్లైఓవర్ వేయడంతో లింగాలఘణపురం, సూర్యాపేట నుంచి వచ్చే వారికి ఇబ్బందిగా ఉంది.
- వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వేసినా.. అండర్‌పాస్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో వాహనాలకు క్రాసింగ్ సౌకర్యం లేక.. కొంత దూరం వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సి వస్తోంది.
- యశ్వంతాపూర్ బైపాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదకరంగా ఉంది.
- రఘునాథపల్లి మండలం నిడిగొండలో బస్‌స్టేజీ లేదు.. సైడ్ రెయిలింగ్‌లు లేక ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారు.
- రఘునాథపల్లి బస్టాండ్ వద్ద వెహికిల్ అండర్‌పాస్‌కు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు లేక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఖిలాషాపూర్ రోడ్డు వద్ద యూటర్న్ లేక సమస్యగా ఉంది.
- స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ పనులు అరకొరగా చేపట్టారు.



జనగామ బైపాస్ రోడ్డు సమీపాన బోర్డు..



పెంబర్తి వద్ద ఎన్‌హెచ్ పక్కన వైన్‌షాపు



మరో పక్కన టిఫిన్ సెంటర్లు

నాణ్యత వినియోగదారుడి హక్కు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన ఉన్నతాధికారులు, విద్యార్థులు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ: మార్కెట్‌లో నాణ్యమైన వస్తువులను ఎంపిక చేసుకోవడం వినియోగదారుడి ప్రాథమిక హక్కు అని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'క్లీన్ ఎనర్జీ ట్రాన్సేషన్ ద్వారా వినియోగదారులను శక్తివంతం చేయడం' అనే అంశంపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న ప్రకృతిని ప్రతి ఒక్కరూ సరియైన పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు సహజ సిద్ధమైన వనరుల ద్వారా లభించే వస్తువులతో ఆరోగ్యాలను కాపాడుకోవాలని చెప్పారు. సమాజంలో ప్రతి పౌరుడికి భద్రత, సమాచారం, వస్తువుల ఎంపిక, విజ్ఞప్తి, పరిష్కారం, విద్య పొందే హక్కు చట్టంలో కల్పించారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వినియోగదారుల కార్యకర్త సాధిక్ అలీ, డీఆర్డీఓ రాంరెడ్డి తదితరులు మాట్లాడారు. సదస్సులో సివిల్ సప్లయ్ అధికారి రోజారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ రజిత, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, వెల్ఫేర్ అధికారిని జయంతి, డీఏఓ వినోద్‌కుమార్, డీఎంఓ నాగేశ్వర శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకన్న, సీపీఓ ఇస్మాయిల్, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా సిద్ధిలింగం

- ఉద్యమ బిడ్డకు అవకాశం
- రెండు రోజుల్లో ప్రమాణ స్వీకారం
- ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడు..



సిద్ధిలింగానికి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే

జనగామ: తెలంగాణ ఉద్యమకారుడిని మరోసారి అదృష్టం వరించింది. సర్పంచ్‌గా ఐదేళ్ల పాటు ఊరికి సేవలందించి.. బీఆర్‌ఎస్‌లో ముఖ్య నాయకుడిగా.. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరున్న జనగామ మండలం పెంబర్తికి చెందిన బాల్దె సిద్ధిలింగం జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి రఘునందనరావు బుధవారం నూతన పాలక మండలిని ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

కాల పరిమితి ముగిసిన నాలుగు నెలలకు..

జనగామ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి పదవీ కాలం గత ఏడాది నవంబర్ 25తో ముగియగా.. ఇప్పుడు కొత్త కమిటీని ప్రకటించారు. ప్రస్తుతం ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం వచ్చిన సిద్ధిలింగం సతీమణి విజయ రెండేళ్ల పాటు మార్కెట్ చైర్‌పర్సన్‌గా కొనసాగగా.. ఒక ఏడాది పొడిగించారు. నాలుగు నెలల పాటు చైర్మన్ ఎంపిక విషయంలో సందిగ్ధత కొనసాగినా.. ముందుగా అనుకున్న పేరునే ప్రకటించారు. పార్టీలో వివాదరహితుడిగా పేరున్న సిద్ధిలింగానికి ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు మంత్రి అండదండలు ఉండడంతో భార్య తర్వాత భర్తకు అవకాశం లభించింది. కొత్త పాలక మండలిలో చైర్మన్, ఉపాధ్యక్షుడితో పాటు 16 మంది సభ్యులను ప్రకటించారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి సభ్యులుగా ఉంటారు. ఈనెల 18న నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది.

కొత్త పాలక మండలి ఇదే..

చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, ఉపాధ్యక్షుడు ముసిపట్ల విజయ్‌కుమార్, సభ్యులు మాల రాజు, శివరాత్రి రాజ్‌కుమార్, నూనెముంతల యాకస్వామి, బసవగాని బాలమల్లేశ్, సేవెల్లి మధుసూదన్, గువ్వల రవి, ఋషిగంపల ఆంజనేయులు, ధర్మజయప్రకాష్‌రెడ్డి, అజ్మీరా మంగమ్మ, సుధగాని సంజీవ, మాశెట్టి వెంకటేశ్వర్లు(అడ్తి), మాశెట్టి అశోక్(ట్రేడర్/రైస్‌మిల్లర్)తో పాటు పీఏసీఎస్ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇద్దరు అధికారులు కొత్త పాలకమండలిలో ఉంటారు.

ఎమ్మెల్యేలను కలిసిన కొత్త చైర్మన్

ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న సిద్ధిలింగం బుధవారం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్యను నూతన సభ్యులతో వెళ్లి మర్యాద పూర్వకంగా కలువగా.. వారు సిద్ధిలింగంకు నోరు తీపిచేశారు. మార్కెట్‌కు మరింత పేరు తీసుకు వచ్చి అందరి మన్ననలు పొందాలని సూచించారు.

అభివృద్ధి పనులకు మంజూరు ఇవ్వండి

- మంత్రి కేటీఆర్‌ను కోరిన ఎమ్మెల్సీ కడియం



చిల్పూరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంజూరు ఇవ్వాలంటూ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. గత నెల హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో నిర్వహించిన రైతు ధన్యవాద సభలో పలు సమస్యలను కడియం శ్రీహరి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అందులో ధర్మసాగర్ నుంచి తరిగొప్పుల (వయా ముప్పారం, నారాయణగిరి, పీచర, మద్దెలగూడెం, కొమ్ముగుట్ట, లింగంపల్లి, శ్రీపతిపల్లి) వరకు 35 కిలోమీటర్ల బీటీని డబుల్ రోడ్డు చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన వేలేరు, చిల్పూరు మండల కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ, ఇతర కార్యాలయాల నిర్వహణకు మండల కాంప్లెక్స్ భవనాలు మంజూరు చేయాలి పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి స్థలంలో నూతన భవనం నిర్మించి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్ గ్రామాలను కలిపి మున్సిపాలిటీ మంజూరు చేయాలి కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కడియం తెలిపారు.

సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.20,83,388



కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.20,83,388 వచ్చినట్లు ఈఓ నండూరి రజనీకుమారి తెలిపారు. 2022 నవంబర్ 22 నుంచి 2023 మార్చి 15 వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, 113 రోజుల ఆదాయాన్ని బుధవారం గుట్టపై దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్గొండ జిల్లా సహాయ కమిషనర్ మహేంద్రకుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. అమెరికా కరెన్సీ నోట్లు 34 (190 డాలర్లు), నాలుగు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. లెక్కింపులో ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, ధర్మకర్తలు, సూపరింటెండెంట్, సిబ్బంది, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

20న విద్యుత్ ఉద్యోగుల బహిరంగ సభ

కట్టలనూ వదల్లేదు!

శిక్షణ పొంది ఉత్తమ ఫలితాలు సాధించాలి

- వివరాలు 10లో

మోకు లేకుండా 'కల్లుగీత'



గిరక చెట్టు నుంచి కల్లు తీస్తున్న లక్ష్మయ్య

దేవరుప్పుల: తాటికల్లు గీసే కార్మికులకు నిత్యం జీవన్మరణ సమస్యే.. అలాంటిది మోకు లేకున్నా ఉపాధి కల్పిస్తోంది గిరక కల్లు. మండల పరిధి గొల్లపల్లిలో ఆరేళ్ల క్రితం హరితహారం కింద గీత కార్మికులకు ఉపాధి కల్పించడానికి ప్రస్తుత మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా నుంచి గిరక తాటి మొక్కలు తెప్పించి పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. గొల్లపల్లికి చెందిన గీత కార్మికులు ఇంటి ఆవరణలో విరివిగా వాటిని నాటగా.. నేడు ఆ ఫలాలను పొందుతున్నారు. ఈ సందర్భంగా గీత కార్మిక కుటుంబానికి చెందిన విద్యావంతుడు తీగల లక్ష్మయ్య మాట్లాడుతూ కాలానుగుణంగా యువత వృత్తికి దూరమవుతున్న క్రమంలో మోకు లేకుండా నిచ్చెన సాయంతో కల్లు గీస్తున్నామని చెప్పారు. ఒక చెట్టుకు రోజుకు ఏడు లీటర్ల పైచిలుకు కల్లు పారడంతో ఉపాధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. రుచి తాటి కల్లుకు తీసిపోకుండా ఉందని వినియోగదారుడు అవదూత సుందర్ తెలిపారు.

సాగు నీరు విడుదల చేయాలి



ఛాగల్లులోని దేవాదుల పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ చంద్రుతండా, విశ్వనాథపురం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం ఛాగల్లు గ్రామంలోని దేవాదుల పంప్‌హౌస్ వద్ద నిరసన తెలిపారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో.. పంప్‌హౌస్ కెనాల్ నుంచి నీరు విడుదల చేయడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా మండిపడ్డారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. తక్షణమే నీరు విడుదల చేయకపోతే తామే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకుంటామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న దేవాదుల అధికారులు నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం అధికారులు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో చంద్రుతండా సర్పంచ్ రాజు, రైతులు గణేష్, శంకర్, ఆము, చరన్ తదితరులు పాల్గొన్నారు.

'క్రిటికల్ కేర్' పనుల పరిశీలన



ఆస్పత్రి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

జనగామ: పట్టణంలోని చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) పక్కన నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రి లే అవుట్‌ను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, భవన నిర్మాణం చేపడుతున్న కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులతో కలిసి అక్కడికి చేరుకున్న ఆయన.. నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ రవీందర్, టీఎస్ఎంఐడీసీ ఇంజనీర్ రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, గిరిబోయిన అంజయ్య, మిద్దెపాక లెనిన్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు హాజరు 95.33 శాతం
- 4,668 మంది విద్యార్థులకు హాజరైంది 4,450..
- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్



జనగామ: సాంఘిక సంక్షేమ కళాశాల కేంద్రంలోకి పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

జనగామ రూరల్: ఇంటర్మీడియట్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8 గంటలకే ఆయా సెంటర్లకు చేరుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. తాగు నీరు, మెడికల్ సిబ్బంది, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 4,668 మంది విద్యార్థులకు మొదటి రోజు 4,450 మంది పరీక్షకు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,350 మందికి 3,264(97.43 శాతం), ఒకేషనల్ విభాగంలో 1,318 మందికి 1,186(89.98 శాతం) మంది పరీక్ష రాసినట్లు ఇంటర్ విద్యా అధికారి తెలిపారు.

కేంద్రాల పరిశీలన

పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాల, ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల, ప్రిస్టియన్ కళాశాల సెంటర్లను కలెక్టర్ శివలింగయ్య పరిశీలించి తగు సూచనలు చేశారు. అలాగే గాయత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

సెంటర్ల వద్ద బందోబస్తు..

జిల్లా కేంద్రంలో ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల వద్ద ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు లేకుండా చెక్ చేసి సెంటర్లలోకి పంపించారు. అలాగే పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉండగా.. జిరాక్స్ సెంటర్లు మూసివేశారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు చొప్పున పోలీసులను కేటాయించారు. ప్రశ్నపత్రాలను పోలీసులు తీసుకురాగా.. డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌యాదవ్ పలు సెంటర్లను పర్యవేక్షించారు.



జనగామ: ఏబీవీ కళాశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు కలెక్టర్..



సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల వద్ద..

హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

ఖిలా వరంగల్: ఓవ్యక్తిపై దాడి చేసి కళ్లల్లో కారం నీళ్లు చల్లి, కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సైలు సాంబయ్య, సుమన్, వినయ్‌కుమార్‌తో కలిసి ఇన్‌స్పెక్టర్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటకు చెందిన జెటబోయిన ఈశ్వర్, నవ్య దంపతులు కిరాణా దుకాణం నడుపుతూ జీవిస్తున్నారు. అతడి సమీప బంధువు జెటబోయిన ఎల్లయ్య ఈనెల 7న మధ్యాహ్నం కిరాణం దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకున్నాడు. 'చేతిలో డబ్బుల్లేవు ఫోన్‌పే ఉందా' అని ఈశ్వర్‌ను అడిగాడు. లేదు అనగానే ఆగ్రహానికి లోనైన ఎల్లయ్య ఈశ్వర్‌ను బూతులు తిట్టి వెళ్లాడు. అదే మనసులో పెట్టుకున్నాడు ఎల్లయ్య. అదే రోజు రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్తున్న ఈశ్వర్ కళ్లల్లో ఎల్లయ్య కోడలు స్వర్ణలత కారం చల్లింది. అక్కడే మాటువేసిన ఎల్లయ్య, స్వర్ణలత ఇద్దరూ ఈశ్వర్‌ను గట్టిగా పట్టుకోగా.. ఎల్లయ్య కుమారుడు అరుణ్ పదునైన కత్తితో ఈశ్వర్ పొత్తి కడుపు, ఛాతిభాగంలో పొడిచాడు. గమనించిన ఈశ్వర్ తల్లిదండ్రులు రాజేశ్వరి, వెంకటేశ్వర్లు ఘటనా స్థలికి చేరుకోగా.. అక్కడి నుంచి అరుణ్, ఎల్లయ్య, స్వర్ణలత పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న ఈశ్వర్‌ను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రుడి భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఎల్లయ్య, అరుణ్, స్వర్ణలతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి



ఆకతాయి(వృత్తంలో)ని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

వరంగల్: వరంగల్ తిలక్‌రోడ్‌లో గురువారం ఒక విద్యార్థినిని ఓ ఆకతాయి అల్లరి పెట్టడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానంద కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్ రాసి వస్తున్న సమయంలో తిలక్‌రోడ్‌లోని ఏ-వన్ కేక్ ఫ్యాక్టరీ సమీపంలో విద్యార్థిని చున్నీపట్టి లాగడంతో ఆమె కేకలు వేసింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు యువకున్ని పట్టుకొని దేహశుద్ధి చేసి 100 నంబర్‌కు డయల్ చేశారు. ఇంతే జార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. తిలక్‌రోడ్‌లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, వరసగా రెండు, మూడు బేకరీలు, ఎదురుగానే బార్ ఉండడంతో ఎప్పుడు బిజీగా ఉండడంతో పాటు ఈప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ఈవీధిపై దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులే కొరియర్లు!

- గంజాయి రవాణాలో కొత్తకోణం
- కొనుగోలుదారుల్లో ఉన్నత విద్యావంతులు
- వరంగల్ రైల్వేగేట్ ఏరియాలో యథేచ్ఛగా విక్రయాలు
- టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి కేసులు..



గంజాయి రవాణా చేస్తూ ఏసీరెడ్డినగర్‌లో పట్టుబడిన ముగ్గురు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, ఆటో (ఫైల్)

ఖిలా వరంగల్: గంజాయి రవాణాలో విద్యార్థులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈజీ మనీ, జల్సాలకు అలవాటు పడి సరుకును చేరాల్సిన చోటుకు చేరుస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసుల సంయుక్త దాడుల్లో విద్యార్థులు, యువకులు కొరియర్లుగా మారుతున్నారనే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

విచ్చలవిడిగా విక్రయం

వరంగల్ నగరంలో గంజాయి వినియోగం ఒకప్పుడు గుట్టుగా సాగేది. ప్రస్తుతం బాగా పెరిగిపోయిందని ఇటీవల తరచూ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న అనేక ఘటనలు చెబుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో యువత, విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. వీరు మత్తుకు బానిసగా మారుతున్నట్లు ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు చేసిన సోదాల్లో బయటపడింది. వరంగల్ ట్రైసిటీ రహదారులపై బైక్ రేస్‌లు, పరస్పర దాడులు, పలువురు యువత వికృత చేష్టలను చూస్తే గంజాయి వినియోగం ఏ విధంగా మారిందో చెప్పవచ్చు. శివనగర్, ఏసీరెడ్డినగర్‌లో గుట్టుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. ఇక్కడ గంజాయి వ్యసనపరులు ఎక్కువగా ఉన్నారు. నిర్జన ప్రదేశాలల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుని గంజాయిని సిగరెట్లలో మార్చి 50 గ్రాముల గంజాయిని రూ.200ల నుంచి రూ.300ల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

రైల్వేగేట్ ఏరియాలో ..

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వరంగల్ తూర్పులో దొరకని ఏరియా లేదంటే అతిశయోక్తి కాదు. గతేడాది నుంచి నేటి వరకు వరంగల్ నగరంతో పాటు మిల్స్ కాలనీ, మామునూరు, మట్టెవాడ ఏరియాలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేసి కేజీల కొద్దీ ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ప్రధానంగా శివనగర్, ఏసీరెడ్డినగర్, కరీమాబాద్, శంభునిపేట, ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతాల్లో దాడులు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనలు కోకొల్లలు. ఈప్రాంతాలకు చెందిన యువత, విద్యార్థులు గంజాయికి బానిసై ఆంధ్ర, ఒడిశా నుంచి కారు, బైక్‌లపై అత్యంత రహస్యంగా నగరానికి తెచ్చి విక్రయాలు సాగిస్తున్నట్లు ఇటీవల టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బయటపడ్డాయి.

చర్యలు తీసుకుంటున్నాం



పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలి. పాఠశాలలు, కళాశాలలపై నిఘా పెంచాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతున్నారా? ఇంకేమైనా అలవాట్లున్నాయా? అనే అంశాల్ని తల్లిదండ్రులు పరిశీలించాలి. ఆలస్యంగా ఇంటికి ఇస్తే వెంటనే నిలదీయాలి. గంజాయి విక్రయం, తరలింపును ఎవరైనా గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

- ముస్కు శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, మిల్స్‌కాలనీ

పట్టుబడిన కేసుల్లో మచ్చుకు కొన్ని..

- ఇటీవల శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌కు చెందిన సాయి, విక్కీ ఇద్దరు ఆంధ్ర, ఒడిషా నుంచి ఎండు గంజాయి తెప్పించి మరో ముగ్గురికి విక్రయించారు. ఆ ముగ్గురు గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తూ ఇటీవల పట్టుబడ్డారు. వీరి నుంచి టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆటో, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.
- ఇటీవల మట్టెవాడ పరిధిలో ముగ్గురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుపడ్డారు. వారి నుంచి రెండు కిలోల ఎండు గంజాయి, మూడుఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.
- ఇటీవల వరంగల్ శివనగర్‌కు చెందిన ఓవిద్యార్థి గంజాయికి బానిసయ్యాడు. ఆవిద్యార్థి ఒడిషా కలిమెల నుంచి 3 కిలోల గంజాయిని బైక్‌పై తీసుకొచ్చి సేవిస్తూ విక్రయిస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 2 కేజీల ఎండు గంజాయి, ఫోన్, అపిల్ ఐపాడ్, బజాజ్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అడవి అంటుకుంది



కనుకునూరు-పెగడపల్లి మధ్య కాలుతున్న అడవి

మహాముత్తారం: వేసవి సమీపిస్తున్న తరుణంలో ఆకు రాలుతున్న అడవులకు అగ్గి రాజుకుంటోంది. కిలోమీటర్ల మేర మంటలు అడవంతా వ్యాపిస్తున్నాయి. మండలంలోని కనుకునూరు నుంచి పెగడపల్లి వచ్చే ప్రధాన రహదారి వెంట మంటలు వ్యాపించడంతో వాహనాదారులు వేడి తట్టుకోలేక పోతున్నారు. ఈ మంటలు ఇలాగే కొనసాగితే మండలంలోని అడవంతా.. అంటుకునే అవకాశం ఉంది. దీంతో అడవిలోని చీడ పీడ పురుగులు, పాములు చనిపోయే అవకాశాలున్నాయి. అడవి జంతువులకు ప్రాణహాని ఉంది.

నేడు 'నిధి ఆప్కే నికత్'

హన్మకొండ అర్బన్: ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి భూపాలపల్లిలోని కలెక్టరేట్ పక్కనే ఉన్న ఎల్లంద క్లబ్ హౌస్‌లో ఉదయం 11 గంటలకు నిధి ఆప్కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్ ప్రణీత్‌జోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జిల్లాలోని కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొనే ఈ కార్యక్రమంలో పీఎఫ్ సభ్యులు, యజమానులు, పెన్షనర్లు హాజరై వారి ఫిర్యాదులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఏసీబీ వలలో డీఈఈ

- లంచం తీసుకుంటుండగా డీఈఈ, ఇన్‌చార్జ్ ఈఈ పట్టివేత
- కంప్లీషన్ రిపోర్ట్ పంపేందుకు రూ.65 వేలు డిమాండ్
- రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈఈగా పని చేస్తున్న డీఈఈ మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్ రూ.30వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఏసీబీ డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ కాంట్రాక్టర్ కోడెల వెంకట శైలేంద్రబాబుకు పరకాలలోని మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణానికి సంబంధించి రూ.1.50 కోట్లలో సుమారు రూ.75లక్షలు బిల్లులు వచ్చాయి. మిగిలిన డబ్బుల కోసం ఎస్టిమేట్లను ప్రభుత్వానికి పంపించేందుకు రూ.65 వేలు లంచంగా ఇవ్వాలని హనుమకొండ భవానినగర్ శ్రీనివాసకాలనీకి చెందిన మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇన్‌చార్జ్ ఈఈ, డీఈఈ సిరాజ్ మొహియుద్దీన్ డిమాండ్ చేశారు. ప్రతిపాదనలు పంపాలని కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిన బాధితుడు చివరకు రూ.60 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. డబ్బులు ఇవ్వందే ఎస్టిమేట్లు పంపించేంది లేదని ఈఈ చెప్పడంతో బాధితుడు ఈనెల 5న ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందం ప్రకారం.. రూ.60 వేలల్లో రూ.30వేలు బుధవారం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం లంచం తీసుకున్న డీఈఈ, ఇన్‌చార్జ్ మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్‌ను అరెస్ట్ చేసి మొదటి అడిషనల్ జడ్జి ఎదుట హాజరుపర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈదాడుల్లో సీఐలు జె.శ్యాంసుందర్, కె.శ్రీను, ఎస్.రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్, డీఈఈ

ఎస్టిమేట్ల కోసం ఇబ్బంది..



బిల్లులు పొందేందుకు కంప్లీషన్ రిపోర్టు హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగానికి ప్రతిపాదనలు పంపాలని నాలుగు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగాను. అయినా పట్టించుకోలేదు. రిపోర్టు పంపించేందుకు రూ.65 వేలు లంచం ఇస్తే చేస్తానని డీఈఈ, ఇన్‌చార్జ్ ఈఈగా ఉన్న మహ్మద్ సిరాజ్ మొహినుద్దీన్ చెప్పడంతో దిక్కులేని స్థితిలో ఏసీబీని ఆశ్రయించాను. రిపోర్ట్ పంపేందుకు మొదటి విడతగా రూ.30 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

- కోడెల వెంకట శైలేంద్రబాబు, సివిల్ కాంట్రాక్టర్

15 గొర్రెల అపహరణ

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయిలో బుధవారం గ్రామానికి చెందిన అన్న కుమారస్వామికి చెందిన 15 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కుమారస్వామి పొద్దంతా గొర్రెలను మేపుకుని వచ్చిన అనంతరం మంగళవారం రాత్రి వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి పక్కన మంద పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత మందలోంచి 15 గొర్రెలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వలస కూలీ హత్య

- తోటి కూలీలే చంపి పరారైనట్లు అనుమానం
- నిందితుల కోసం గాలింపు



సూరజ్ మృతదేహం

హసన్‌పర్తి: బతుకుదెరువు కోసం వచ్చిన ఓ కూలీ హత్యకు గురయ్యాడు. హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులో జరిగిన ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాశేశ్వరంలోని విద్యుత్‌శాఖలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావుకు పెంబర్తి శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు కాజీపేటకు చెందిన ఎనగందుల బాబు అనే మేస్త్రీకి అప్పగించారు. వలస లేబర్‌తో మేస్త్రీ తక్కువ కూలీకి పనికి కుదుర్చుకున్నాడు. అందుకు కాజీపేట అడ్డా నుంచి సూరజ్(35)తో పాటు మరో ముగ్గురు కూలీలను తీసుకొచ్చాడు. ఈనెల 8న నలుగురు కూలీలు పెంబర్తికి వచ్చి పనులు మొదలుపెట్టారు. వరుసగా మూడ్రోజులు రాకపోకలు సాగించగా, అతర్వాత పని ప్రదేశంలో ఉంటూ పనులు చేస్తున్నారు.

పని ప్రదేశంలోనే హత్య..

బుధవారం ఉదయం సూరజ్ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండగా, మరో ముగ్గురు కనిపించకుండా పోయారు. విషయం తెలుసుకున్న సదరు మేస్త్రీ బాబు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మేస్త్రీని విచారించారు.

ముగ్గురిపై అనుమానం.. గాలింపు

తోటి కూలీలే సూరజ్‌ను హత్య చేసి పరారైనట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మద్యం సేవించిన తర్వాత జరిగిన ఘర్షణలో ఇనుపరాడ్డుతో తలపై బాదడం వల్ల సూరజ్ మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరారైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో జాగిలాలతో గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



శిరీష(ఫైల్)

మల్హర్: భర్త, అత్త, మామ వేధింపులు భరించలేక మనస్తాపంతో శిరీష(21) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కొయ్యూరు పీవీనగర్ చెందిన రవికుమార్‌తో శిరీషకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక సంవత్సరం పాప ఉంది. శిరీష చుట్టు పక్కల వారితో మాట్లాడుతుంటే.. భర్త అనుమానంతో తరుచూ వేధించేవాడు. ఈక్రమంలో ఈనెల 12న కూడా శిరీషను అనుమానంతో రవి, అత్త, మామలు వేధించారు. దీంతో ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఆమె వెళ్లిపోయింది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 14న మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం మరోసారి గ్రామస్తుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా.. కొయ్యూరు నాగులమ్మ ఆలయ సమీప ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని కనిపించింది. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, కాటారం సీఐ రంజిత్‌రావు పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. శిరీష అన్న పెద్ది గంగారాజు ఫిర్యాదు మేరకు భర్త రవికుమార్, అత్త, మామలు మల్లేశ్వరి, రాజయ్యపై కేసు నమోదు చేసున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు.

విధుల్లో కుప్పకూలిన జీపీ వర్కర్

- గుండెపోటుతో మృతి



కట్టయ్య(ఫైల్)

గీసుకొండ: గ్రామంలోని చెత్తను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న క్రమంలో గుండె పోటుతో గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ బసికె కట్టయ్య(50) బుధవారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామ పంచాయతీలో కట్టయ్య మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో ట్రాక్టర్ నడుపుతూ.. చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే పనులు చేస్తున్నాడు. ట్రాక్టర్ నడుపుతుండగా.. గుండె పోటు రావడంతో దానిపైనే పడిపోయాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందాడు. కట్టయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నాయకుడు బ్రహ్మచారి డిమాండ్ చేశారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



ములుగు రూరల్(గోవిందరావుపేట): ఈతకు వెళ్లి కుంటలో పడి గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన పైడాకుల అక్షయ్‌కుమార్(15) బుధవారం మృతి చెందాడు. అక్షయ్ చల్వాయి మోడల్ స్కూల్ పదోతరగతి చదువుతున్నాడు. బుస్సాపూర్‌లో తన మిత్రులు అవినాశ్, దేవేందర్, అరవింద్‌తో కలిసి గ్రామ శివారులోని రాళ్ల మాటు కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. అక్షయ్‌కి ఈత రాక నీటిలో మునిగిపోయాడు. గమనించిన మిత్రులు అటుగా వెళ్తున్న బాటసారుల సాయంతో అక్షయ్‌కుమార్‌ను కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అక్షయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పస్రా ఏఎస్సై నరోత్తంరెడ్డి తెలిపారు.

ఫంక్షన్‌కు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- ట్రాక్టర్ బైక్ ఢీ.. ఒకరి మృతి



ఘటనాస్థలిలో ఉప్పస్వామి మృతదేహం



ఉప్పస్వామి (ఫైల్)

ఐనవోలు: బంధువుల ఇంటికి వెళ్లొస్తానని కానరాని లోకాలకు వెళ్లిపోయావా? అంటూ మృతుడి భార్య, బంధువులు విలపించిన తీరు అందరినీ కలచివేసింది. మండలంలోని రాంగనర్ గ్రామ శివారులో బుధవారం ఉదయం ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన సాతుపెల్లి ఉప్పస్వామి(47) మృతి చెందాడు. ఉప్పస్వామి డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి తన బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి బైక్‌పై బుధవారం ఉదయం స్వగ్రామానికి బయల్దేరాడు. రాంనగర్ శివారు మూలమలుపు వద్దకు చేరుకున్న క్రమంలో కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన ఆకుతోట యాకయ్య ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఉప్పస్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటకు తరలించారు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

పరీక్ష సరిగ్గా రాయలేదని.. ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని నాగ జ్యోతి మృతదేహం

వరంగల్ క్రైం: పరీక్ష సరిగ్గా రాయలేదని ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థిని కాలేజీ హాస్టల్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్టలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన విద్యార్థిని మురారిశెట్టి నాగజ్యోతి (16) హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ఫస్టియర్ చదువుతోంది. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభంకాగా, మొదటి రోజు పరీక్ష రాసి వచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం హాస్టల్ స్టడీ అవర్ టీ బ్రేక్‌లో గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ వార్డెన్లు చూసి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు కాలేదని సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. పరీక్ష సరిగ్గా రాయలేదని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

పేకాడుతున్న మాజీ కార్పొరేటర్, రిటైర్డ్ ఏఎస్సై అరెస్ట్

- రూ.12 వేలు స్వాధీనం
- వాహనాలు, మొబైల్స్ సీజ్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్ ప్రాంతంలో ఓ పేకాట కేంద్రంపై బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు జరిపింది. ఇందులో పేకాడుతున్న హనుమకొండ యాదవనగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, యాదవనగర్ కృష్ణకాలనీకి చెందిన రిటైర్డ్ ఏఎస్సై తాటికొండ లక్ష్మీనారాయణ, రెడ్డికాలనీకి చెందిన ఇజ్జిగిరి శంకర్, తోట అశోక్, జవహార్ కాలనీకి చెందిన చెరుకు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.12వేలు నగదు, కారు, బైక్‌తో పాటు ఐదు మొబైల్స్ సీజ్ చేశారు.

రైళ్ల రద్దు పొడిగింపు

- ఈనెల 19 నుంచి 21 వరకు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని గంగినేని-ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో రైల్వే నిర్మాణ పనుల కారణంగా రద్దు అయిన రైళ్లను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పొడిగించినట్లు బుధవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే..

ఈనెల 19న మచిలీపట్నం-సికింద్రాబాద్ (07185) ప్రతీ ఆదివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-మచిలిపట్నం (07186) ప్రతీ ఆదివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, డోర్నకల్-విజయవాడ (07755) రోజూ వెళ్లే ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (07756) వెళ్లే ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలం రోడ్ (07979) వెళ్లే డైలీ సింగరేణి, భద్రాచలంరోడ్-విజయవాడ (07278) వెళ్లే సింగరేణి, ఈనెల 21న కాజీపేట-తిరుపతి (07091) ప్రతీ మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కాజీపేట (07092) ప్రతీ మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దూరం తగ్గించిన రైళ్లు ఇవే..

ఈనెల 19 నుంచి 23 వరకు గుంటూరు-సికింద్రాబాద్ (17201) వెళ్లే ఎక్స్‌ప్రెస్ గుంటూరు-కాజీపేట మధ్య, సికింద్రాబాద్-గుంటూరు (17202) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేట-గుంటూరు మధ్య రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

దారి మళ్లింపు, రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా విజయవాడ, బల్లార్షా, సికింద్రాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తూ, రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

